క్లుప్తంగా

సొసైటీలకు 40 మెట్రిక్ టన్నుల యూరియా

శావల్యాపురం: మండలంలోని కారుమంచి, శావల్యాపురం సొసైటీ కార్యాలయాలకు 40 మెట్రిక్ టన్నులు యూరియా సంచులు ప్రభుత్వం సరఫరా చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు మంగళవారం తెలిపారు. యూరియా కోసం ఆందోళన పడాల్సి పనిలేదన్నారు. రైతులు సాగు చేసే పంటల ఆధారంగా యూరియా సంచులను తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకు యూరియా సంచులు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తామన్నారు.

నేడు బొల్లాపల్లి మండల పరిషత్ సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం జరుగుతుందని ఎంపీడీఓ పి.మాధురి మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం జరుగుతుంది. సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. మండలంలో అభివృద్ధి పనుల పై చర్చ ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

నేడు విశ్వశాంతి యజ్ఞ వేడుకలు

శావల్యాపురం: మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్ళమ్మ దేవస్థానం ప్రాంగణంలో శ్రీవీరబ్రహ్మేంద్ర స్వాముల వారి సన్నిధిలో నేడు జరగనున్న విశ్వశాంతి మహాయజ్ఞం కార్యక్రమాన్ని విశ్వబ్రాహ్మణులు అందరు పాల్గొని విజయవంతం చేయాలని మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కొండ్రముట్ల రుద్రమచారి మంగళవారం తెలిపారు. పూజ కార్యక్రమాన్ని అనంతరం అన్నదాన సంతర్పణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు పులుకూరి శ్రీనివాసరావు, తువ్వపాటి యల్లమందచారి, రామబ్రహ్మం, హరిబాబు, రాంబాబు,రాజా తదితరులు ఉన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డీఎల్‌పీవో లక్ష్మణరావు



శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామ పంచాయతీ ఉన్న చెత్తా సంపద కేంద్రాన్ని డీఎల్‌పీవో ఎం.లక్ష్మణరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలన్నారు. గ్రామంలోని క్లాప్ మిత్రలు ఇంటింటి తిరిగి తడి-పొడి చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రానికి తరలించాలన్నారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉండేలా నిరంతరం క్లాప్‌మిత్రల సారథ్యంలో పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఆయనతో పాటు ఇన్‌చార్జ్ ఈవోపీఆర్‌డీ బొడ్డు యాకోబు, పంచాయతీ కార్యదర్శులు శ్రీవల్లి, చింతా శ్రీనివాసరావులు ఉన్నారు.

వినుకొండలో హిందీ దివస్



వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లిలోని శ్రీ బాలాజీ ఐటీఐ కాలేజీలో మేరా యువ భారత (నెహ్రూయువ కేంద్రం) సహకారంతో నేచురల్ హెల్త్ కేర్ సొసైటీ సెక్రటరీ ఎస్. భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో హిందీ దివస్/పక్వాడా 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కర్రి వెంకట్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ వారు దేశ వ్యాప్తంగా హిందీ దివస్ /పక్వాడ 2025 ప్రకటించారన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పొట్లూరి దుర్గాప్రసాద్, నూజెండ్ల వీరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో ఎరువుల దుకాణాల తనిఖీ

రొంపిచర్ల: మండలంలోని మాచవరం, వి.రెడ్డిపాలెం గ్రామాల్లో ఏడీఏ శ్రీనివాసరావు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీని పరిశీలించారు. అలాగే యూరియా పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు, లోపాలు జరగకుండా చూడాలని వీఏఏలకు సూచించారు. మాచవరం గ్రామంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. గోదాంలోని నిల్వలకు రికార్డులతో సరిచూశారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు.ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి శివలలిత, ఆయా గ్రామాల వీఏఏలు పాల్గొన్నారు.

భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

- ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె అమల కుమారి
- కొత్తపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



మాట్లాడుతున్న అమల కుమారి

యడ్లపాడు: భూమి ఆరోగ్యాన్ని కాపాడితేనే పంటల ఆరోగ్యం, దాని ద్వారా మానవ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పల్నాడు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమల కుమారి చెప్పారు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు కీలక సూచనలు చేశారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఆధారంగా అధికారులు సాయిల్‌హెల్త్ కార్డులు అందజేస్తామని తెలిపారు. రసాయన ఎరువుల అధిక వాడకం వల్ల భూసారం దెబ్బతింటుందని, సమగ్ర పోషక యాజమాన్యం పాటించడం ద్వారా భూమిని రక్షించుకోవచ్చని వివరించారు.

పత్తి పంటకు ప్రకృతి ఆధారిత పరిష్కారాలు

పత్తిపంట పొలాలను పరిశీలించిన ఆమె, రసం పీల్చే పురుగుల నియంత్రణకు పసుపు అట్టలు, లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే, ప్రకృతి ఆధారిత ద్రావకాలైన వేపగింజల కషాయం, జీవామృతం, కోడిగుడ్డు- నిమ్మరసం ద్రావణం వంటి వాటిని పిచికారీ చేయడం వల్ల పురుగుల బెడదను నివారించవచ్చని ఆమె వివరించారు.



వరి పైరును పరిశీలిస్తున్న ఏవో వరలక్ష్మి

సమగ్ర పోషక యాజమాన్యం ఆవశ్యకత

విత్తనాలు, జీవన ఎరువులు, జీవశిలీంద్రనాశిని, అజోస్పిరిల్ల వాడడం వల్ల భూమి సారం పెరుగుతుందని ఆమె తెలిపారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీ విధానం, వాటి ప్రయోజనాలను కూడా రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ మానం సాంబయ్య, అభ్యుదయ రైతులు, విస్తరణాధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

గోకనకొండ, నాగులవరంలో పొలం పిలుస్తోంది

వినుకొండ: మండలంలోని గోకనకొండ, నాగులవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వరలక్ష్మి మాట్లాడుతూ రైతు సోదరులు వరి నారుమడి పీకే వారం ముందు కాబ్సో ఫూర్రాన్ 3-జీ గుళికలు సెంటుకి 160 గ్రాములు పలుచుగా నీరు పెట్టి చల్లాలని, తద్వారా నాటిన 30 రోజుల వరకు చీడపీడల ఉధృతి అరికట్టవచ్చని తెలిపారు. కౌలురైతులు అన్నదాత సఖీభవ పథకం లబ్ధి పొందడానికి సీసీఆర్‌సీ కార్డు పొంది పంట నమోదు చేయించుకొని ఆర్‌ఎస్‌కేల్లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో ఆరిఫ్, వీఏఏ చాందిని, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్
- కారుచోలలో జెడ్పీహైస్కూల్లో ఘనంగా ఓజోన్ దినోత్సవం
- అవగాహన ర్యాలీ, వివిధ పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు



కారుచోలలో నిర్వహించిన అవగాహన ర్యాలీ

యడ్లపాడు: భావితరాలకు కాలుష్య రహిత ప్రపంచాన్ని అందించాల్సిన బాధ్యత ప్రస్తుత సమాజంపై ఉందని పల్నాడు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని కారుచోల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓజోన్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో గొడుగులు చేతబట్టి ఓజోన్ ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొర పరిరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ నినాదాలు చేశారు. అనంతరం పాఠశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.రవికుమార్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ సైన్స్ మానవ జీవితంలో అంతర్భాగంగా మారిందని, అయితే కాలుష్యంపై నిర్లక్ష్యం మానవాళి వినాశనానికి దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఓజోన్ పొరకు పడుతున్న చిల్లుల వల్ల అతి నీలలోహిత కిరణాలు భూమిని చేరడంతో ఫలితంగా అనేక జబ్బులకు కారణమవుతున్నాయన్నారు. ఓజోన్ పరిరక్షణపై ప్రతిఒక్కరీ అవగాహన కల్పించాలని కోరారు. ముందుగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల విజేతలకు ఎస్ఎంసీ చైర్మన్ బోనం అనిత, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏవీ నారాయణ, రమేష్, సాంబశివరావు, ఏవీ ప్రసాద్, రాజ్యలక్ష్మి, శివాజీ, రమాదేవి, సుధారాణి, సుగంధరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

మేనేజరు వలేటి శివకృష్ణ



మాట్లాడుతున్న శివకృష్ణ

శావల్యాపురం: సైబరు నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని (చైతన్య గోదావరి గ్రామీణ) ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజరు వలేటి శివకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ ఆదేశాల మేరకు యూనియన్ బ్యాంకు వారి సారథ్యంలో స్వయం సహాయక మహిళా సభ్యులకు ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు బ్యాంకు పరమైన సేవలు సందేహాలు నివృత్తి చేసుకునేందుకు నేరుగా బ్యాంకు అధికారులను సంప్రదించాలన్నారు. సెల్‌ఫోనుకు బ్యాంకు నుంచి తప్పుడు సందేశాలు రావన్నారు. ఇటీవల కాలంలో సైబరు నేరగాళ్లు తప్పుడు కాల్స్ చేసి మోసపూరిత మాటలతో భయానికి గురి చేయటం పాటు ఖాతాలను హ్యాక్ చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ అరుణ్ నెహ్రూ, అవార్డు సంస్థ ప్రతినిధులు మాచర్ల ఎఫ్రాయిల్, హుస్సేన్, యానిమేటరు శివపార్వతి ఉన్నారు.

విస్తృత పచ్చదనంతోనే ఓజోన్ సంరక్షణ

చిలకలూరిపేటటౌన్:జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీసీ వెల్ఫేర్ వసతి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డీజిల్, పెట్రోలు వంటి ఇంధనాల వాడకం తగ్గించి, సౌర విద్యుత్ వంటి వాటిని ప్రోత్సహించినపుడే పర్యావరణ పరిరక్షణ ఉంటుందన్నారు. జనవిజ్ఞాన వేదిక ప్రచురణల విభాగం రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ విస్తృతంగా మొక్కలు నాటి పరిసరాలను అరణ్యాలుగా మార్చినప్పుడే ఓజోన్ పొరను పరిరక్షించుకోగలమని తెలిపారు. అనంతరం విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. హరితహారం అనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గార్డ్స్ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, ఏజీపీ దాసరి చిట్టిబాబు హాస్టల్ వార్డన్ కృపావతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో డాక్టర్ పీవీ సుబ్బారావు, ఏజీపీ దాసరి చిట్టిబాబు, డాక్టర్ దార్ల బుజ్జిబాబు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

నీడ్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్



నాదెండ్ల: మైనర్ బాలికల వివాహం చట్టరీత్యా నేరమని, 18 ఏళ్లు నిండిన బాలికలు మాత్రమే వివాహానికి అర్హులని నీడ్స్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ చెప్పారు. చందవరం ప్రాథమిక పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మైనర్ బాలికలకు వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రభుత్వ అధికారులకు సమాచారమివ్వాలని ప్రజలను కోరారు. బాలికలకు చక్కగా చదివించి వారు జీవితంలో స్వశక్తితో ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.సతీష్, ఉపాధ్యాయులు లక్ష్మయ్య, ఇస్రాయేలు, అంగన్‌వాడీ కార్యకర్త వెంకట కోమలి, స్థానికులు పాల్గొన్నారు.

యంగ్ స్టార్స్ ఫౌండేషన్‌కు పురస్కారం



వినుకొండ: అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ మూడవ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడ అక్కినేని కళాకేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వినుకొండకు చెందిన యంగ్ స్టార్స్ హెల్పింగ్ హార్ట్స్ ఫౌండేషన్‌కు జాతీయ సేవ రత్న అవార్డు అందచేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనిల్ మాట్లాడుతూ మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వేర్వేరు రాష్ట్రాలలో స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వారికి అవార్డులు అందచేయటం జరుగుతుందన్నారు. అవార్డు పొందిన ఫౌండేషన్ సభ్యులను పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

బోధనోపకరణాలతో బోధిస్తే సత్ఫలితాలు

శావల్యాపుం: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు బోధనోపకరణాలు ద్వారా విద్యార్థులు బోధించటం వలన మంచి ఫలితాలు వస్తాయని ఎంఈవో మద్దికుంట సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని తుమ్మలకుంట గ్రామం ఎంపీపీ స్కూలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఛాయచిత్రాలు ద్వారా విద్యార్థులకు బోధించటం ద్వారా సులువుగా అర్థంమౌతుందన్నారు. రోజు వారి బోధనలు టీఎల్ఎంతో భాగం చేసుకోవాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి విద్యార్థుల ప్రగతి పత్రాలు వ్యక్తిగతంగా ప్రశ్నలు అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పనితీరును ప్రత్యేకంగా అభినందించారు. ప్రధానోపాధ్యాయులు బిళ్ళ రాజా రమేష్, దూపాటి అనుసూయ సీఆర్‌పీ ఏడుకొండలు ఉన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి వేడుకలు

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీనీలంపాటి అమ్మవారి సన్నిధిలో ఈనెల 22వ తేదీ నుంచి దసరా వేడుకలు అక్టోబరు 2వ తేదీ వరకు ఘనంగా నిర్వహించుతున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మద్దినేని హరిబాబు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామస్తులు దాతలు సహకారంతో దసరా వేడుకలు నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ సారథ్యంలో ప్రతిరోజు అమ్మవారికి కుంకుమ పూజలు అభిషేకాలు హోమాలు జరుగుతాయన్నారు. దసరా చివరిరోజు భారీ అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు సాయంత్రం కోలాటం వివిధ రకాల వేషాధారణలతో గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆయనతో పాటు కేతేపల్లి వెంకటేశ్, కొర్నెపల్లి సాంబశివరావు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

22 నుంచి దేవి శరన్నవరాత్రులు

నాదెండ్ల: గణపవరం కోదండరామాలయంలో ఈనెల 22 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకూ శ్రీ దేవీ శరన్నవరాత్రులు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు డి.అనిల్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యుడు ఐతా శ్రీనివాసరావు తెలిపారు. 22న సోమవారం బాలత్రిపుర సుందరీదేవి, 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కామాక్షిదేవి, 26న మహాలక్ష్మిదేవి, 27న లలితా త్రిపురసుందరీదేవి, 28న కాళికాదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1న మహిషాసురమర్దిని, 2న రాజరాజేశ్వరి అలంకారాల్లో దర్శనమివ్వనున్నారు.

ఆదేరోజు సాయంత్రం 5 గంటలకు బతుకమ్మ నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 7 గంటలకు పరివారదేవతా నిత్యార్చన, సాయంత్రం 6 గంటలకు సామూహిక కుంకుమార్చనలు, 9 గంటలకు గణపతిపూజ, మండపారాధన, కలశస్థాపన జరుగుతాయన్నారు.

నాదెండ్లలో ఉచిత వైద్యశిబిరం

సంతాన సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల శివాలయం కల్యాణ మండపంలో మంగళవారం నరసరావుపేట శ్రేయ హాస్పిటల్స్ అండ్ ఐవీఎఫ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణులు, సంతానం లేని సుమారు వంద మంది శిబిరానికి తరలివచ్చారు. డాక్టర్ ఎం వసంతకిరణ్ వైద్యసేవలందించారు. సంతానం లేని వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించి 25 మందిని ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలసరి రానివారు, ట్యూబ్స్ మూసుకుపోయిన వారు, నీటి గడ్డలు, నీటి తిత్తులు ఉన్న వారికి ల్యాప్రోస్కోపీ, హిస్టిరోస్కోపీ పరీక్షలు నిర్వహించి సరైన వైద్యం అందిస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ తర్వాత మరలా సంతానం కోరుకునే వారికి సంతానం కలిగేలా చికిత్స చేయవచ్చన్నారు. క్యాంపులో రిజిష్టర్ అయిన లబ్ధిదారులకు మొదటి విజిట్‌లో కన్సల్టేషన్ ఫీజు ఉచితమని, స్కానింగ్, రక్త పరీక్షల్లో రాయితీ ఇస్తామని తెలిపారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వసంతకిరణ్

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

నూజెండ్ల: రేషన్ వ్యవస్థలో పారదర్శకత కోసం స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకువచ్చినట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రమైన నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం కార్డుల పంపిణీ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ తులసి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తహసీల్దార్ రమేష్ కుమార్, వినుకొండ యార్డ్ చైర్మన్ మీసాల మురళీకృష్ణ పాల్గొన్నారు. చౌక బియ్యం పక్కదారి పట్టకుండా నివారించటమే లక్ష్యంగా స్మార్ట్ రైస్ రేషన్ కార్డులను అందించటం జరుగుతుందన్నారు. క్యూ ఆర్ కోడ్ వంటి ప్రత్యేకతల వల్ల రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌకర్యం ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ కార్డుల పంపిణీ చేపట్టడం జరుగుతుందన్నారు. యార్డ్ చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలోనే కార్డులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీర్ల వెంకటస్వామి, నీటి సంఘాల అధ్యక్షులు బుల్లిశ్వరెడ్డి, లగడపాటి సూరిబాబు, తిరిపాలు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన స్మార్ట్ రైస్ కార్డులతో లబ్ధిదారులకు పలు ప్రయోజనాలు చేకూరుతాయని ఇన్‌చార్జి తహసీల్దార్ షేక్ సల్మాన్ చెప్పారు. నాదెండ్ల పంచాయతీ కార్యాలయంలో మంగళవారం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రైస్‌కార్డులను సర్పంచ్ మొగిలి నాగలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 20690 స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాదెండ్ల పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబు, డిప్యూటీ ఎంపీడీవో తోకల వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

కుళాయి చార్జీలు, ఆస్తి పన్ను వెంటనే చెల్లించండి

నరసరావుపేట: పట్టణంలో నూతనంగా నిర్మించిన కట్టడాలకు ఆస్తిపన్ను, నీటి కుళాయి బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ అతిథి గృహంలో డోర్ టు డోర్ సర్వే చేసేందుకు ఏర్పాటుచేసిన వార్డుసచివాలయ పరిపాలనా, ఎమినిటీస్ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నీటి చార్జీలు వందశాతం వసూలు చేయాలన్నారు. నూతన కట్టడాలను గుర్తించి వాటిపై పన్ను విధించి వసూలు చేయాలని సూచించారు. మున్సిపల్ ఇంజనీర్ జి.రవికుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షేక్ మహమద్ రఫీక్, అసిస్టెంట్ ఇంజనీరు జ్యోతి, ఆర్ఓ శ్రీనివాసరావు, రెవెన్యూ ఇనస్పెక్టర్లు ఎస్.బెయిలీబాబు, సయ్యద్‌జహంగీర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ జస్వంతరావు, అధికారులు

ముగ్గురు బాలికలను దత్తత తీసుకున్న సెంచరీ ఐఏఎస్ అకాడమీ

నరసరావుపేట: తన సూచన మేరకు పదవ తరగతి పరీక్షలలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు జిల్లా బాలికలను రాజమహేంద్రవరంకు చెందిన 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమీ దత్తత తీసుకున్నట్లు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పిలుపు మేరకు పీ4 కార్యక్రమంలో భాగస్వాములవుతూ విద్యార్థుల భవిష్యత్తుకు సహకారం అందించేందుకు ముందుకు వచ్చిన అకాడమీ సంస్థకు జాయింట్ కలెక్టర్ కృతజ్ఞతలు తెలియచేశారు.

యువతను పొగాకు బారి నుంచి రక్షిద్దాం

నూజెండ్ల: పొగాకు రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పాటు పడాలని పీయంశ్రీ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. శ్రీదేవి సూచించారు. మండల కేంద్రమైన నూజెండ్ల జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా పొగాకు రహిత విద్యాసంస్థలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమం పై విద్యార్థులు నాటక ప్రదర్శన నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.శ్రీదేవి మాట్లాడుతూ పొగాకు అవశేషాలు పాఠశాల ఆవరణలో లేకుండా చూడాలన్నారు. పొగాకు అలవాటు నుంచి యువతను దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు. వారి ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలను ఈ సందర్భంగా విద్యార్థులకు వివరించారు.



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

క్రైమ్ కార్నర్

గంజాయి విక్రేత అరెస్ట్

నరసరావుపేట రూరల్: గంజాయి విక్రయించేందుకు ప్రయత్నించిన వ్యక్తిని రూరల్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారంతో రావిపాడు రోడ్డులో రూరల్ ఎస్ఐ కిషోర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ముప్పాళ్ల మండల కేంద్రానికి చెందిన పఠాన్ చాంద్‌బాషా పోలీసులకు తారసపడ్డాడు. అతని వద్ద పరిశీలించగా 250 గ్రాముల గంజాయి లభ్యమైంది. నిందితుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. గతంలో కూడా నిందితుడిపై గంజాయి రవాణా కేసు ఉన్నట్లు పోలీసులు విచారణలో తెలిసింది. ఒరిస్సాకు చెంది న వ్యక్తి ద్వారా గంజాయిను తెప్పించి స్థానికంగా అమ్మకాలు జరుపుతున్నట్లు నిందితుడు వెల్లడించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తూబాడులో రూ.2.50 లక్షలు చోరీ

నాదెండ్ల: మండలంలోని తూబాడు గ్రామంలో పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తూబాడు గ్రామానికి చెందిన దుద్దుకూరి పోలురాజు వ్యవసాయంతో పాటూ జీవాలను మేపుకుని జీవిస్తుంటాడు. గతంలో బ్యాంకులో నగలు తాకట్టుపెట్టి రూ.2.50 లక్షలు రుణం తీసుకున్నాడు. ఈ నెల 14న ఆదివారం క్రోసూరు సంతలో జీవాలను అమ్మగా రూ.2.50 లక్షలు రావటంతో నగదును ఇంట్లోని బీరువాలో పెట్టారు. సోమవారం ఉదయం పొలం పనులకు కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి రాగా తలుపులు తీసి ఉండటం, బీరువా పగలగొట్టి ఉండటం గమనించారు. బీరువాలోని రూ.2.50 లక్షలు చోరీకి గురైనట్లు గుర్తించారు. మంగళవారం పోలీసులకు సమాచారమిచ్చారు.

స్కీం నిర్వాహకుడిపై చీటింగ్ కేసు

నరసరావుపేట టౌన్: స్కీం డబ్బులతో ఉడాయించాడని బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో స్కీమ్ నిర్వాహకుడిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హైమారావు మంగళవారం తెలిపారు. ఇస్సప్పాలెం గ్రామానికి చెందిన దండా అనిల్ కుమార్ కోట సెంటర్‌లోని చరిష్మా సూపర్ మార్కెట్ నిర్వాహకుడు ఏలూరి నాగేశ్వరరావు చేపట్టిన స్కింలో సభ్యుడిగా చేరాడు. ప్రతినెలా అందులో డబ్బులు జమ చేశాడు. తీరా చేతికందే సరికి నాగేశ్వరరావు కుటుంబంతో సహా అజ్ఞాతంలోకి వెళ్లాడు. అనిల్ కుమార్‌తో పాటు మరి కొంతమంది స్కీం సభ్యులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించి తాం స్కీంలో చేరి ఆర్థికంగా నష్టపోయామని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యడ్లపాడులో ఆకస్మిక దాడులు

యడ్లపాడు: విద్యుత్ చౌర్యం అనేది సామాజిక నేరంగా పరిగణింప బడుతుందని, దీనికి జైలుశిక్ష కూడా ఉంటుందని గుంటూరు టౌన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు హెచ్చరించారు. అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న సర్వీసుల్ని గుర్తించేందుకు విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం యడ్లపాడు మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గుంటూరు సీఆర్‌డీఏ సర్కిల్ విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఎం.శ్రీనివాస్ నేతృత్వంలో ఆ శాఖ అధికారులు యడ్లపాడు సెక్షన్ పరిధిలోని 18 గ్రామాల్లో నిర్వహించారు. ఈ దాడుల్లో అనధికారికంగా విద్యుత్ వినియోగించుకుంటున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసి భారీ జరిమానాలు విధించారు. గుంటూరు టౌన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై.ఏడుకొండలు, డీపీఈ-విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సి.హెచ్.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 40 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి.